దుఃఖం, అసహ్యాభావంగా పరిణమిస్తే జీవితం నరకమౌతుంది.

కాబట్టి జీవితంలో కేవలదౌర్బల్యం అనుకొన్న ఒక క్షణికభావనలో అద్భుతశక్తి ఇంతగా ఇమిడి ఉందన్నమాట! అది అటుగాని, ఇటుగాని ఎక్కైనామారి ఎంతదూరమైనా జీవితాన్ని ఈడ్చుకుపోగలదు. దీనికి కారణం ఏభావం దానంతటది ఉండదు. ఒకదానికొకదానికి చిత్రమైన సంబంధం ఉంటుంది. ఒకదానిలోనించి ఇంకొకదానిలోకి నిమిషంలోజారి ఊరుకొంటుంది. నిమిషంలో పాకి నిలవగలుగుతుంది. విసుగు గట్టిగా వినిపిస్తే వైరాగ్యంగా మారగలుగుతుంది. కాబట్టి నిజానికి విసుక్కోడం దౌర్బల్యంకాదు. అది సరైన మార్గంలో దృఢంగా నిలవకపోవటం, నిలుపుకోలేకపోవటం నిజమైన దౌర్బల్యం.

ఐహికంగాగూడా విసుగు ఉపయోగకారే. విసుక్కొని తిరిగి పనిని ఆరంభించినపుడు అంతకుముందు ఆగిన ఉత్సాహం ద్విగుణీకృతంగా దీపిస్తుంది, వియోగంవలన ప్రేమ విజృంభించినట్లన్నమాట.

విసుగు సహజంగా ఉండేదనీ, అది దౌర్బల్య, పరాజయ స్వరూపం అనీ, అయినప్పటికీ దాని వలన ఉపయోగాలుగూడాఉన్నయ్యనీ చూశాం.

రాజకీయాల్లో విసుగు బొత్తిగా పనికిరాదు. లేకుండాపోదు. కానీ గాంభీర్యమవసరం. సరైన దేశభక్తి ఉన్నవాళ్ళు విసుక్కోరు. దేశసేవ చేయటంలో ఆనందం వారికే కలుగుతుంది. దీనికి కారణం దేశభక్తివలన స్వార్థభావం నశిస్తుంది. స్వార్థనాశనం అయింతర్వాత ఆనందమే మిగులుతుంది. విసుగు, ద్వేషం మొదలైన అన్ని భావాలకి స్వార్థమే మూలం. అది సరైతే అన్నీ సరౌతయ్.

---

స్కెచ్

# సేతుబంధనం

"శ్రీ విరించి"

ఎగ్జిబిషన్‌కు వెళ్ళి వస్తూంటే కమల యెదురయింది. మొదట 'యిగ్నోర్' చేదామనుకున్నా గాని సాధ్యం అయిందికాదు. ముందు కమలే మాట్లాడింది:

"అటువేపు రావటం మానేశారు...కోపంగాని వొచ్చిందా?"

ఎందుకు కోపం? కోపం కాదా?

"నిన్నేం పెట్టి పోషిస్తున్నాను కనుకనా నీమీద కోపం?" అన్నాను. తీరా అన్న తరవాత అనిపించింది యింత తేలికగా మాటాడేశానేమిటా అని.

కమల మాత్రం సామాన్యమయింది కనకనా? "పెట్టి పోషిస్తేనే కోపం రావాలని రూలా?" అవును. ప్రతివాడిమీదా కోపం...ఎవరినీ పోషించను. నన్ను నేనే పోషించుకుంటున్నాను కనకనా? అదోతృప్తి.

"అవున్లెండి కోపం వొచ్చింది మీకు—ఎటో వెడుతున్నారు రండి - ఎగ్జిబిషన్ చూదాం"

"చూసే వొస్తున్నాను"

"నాకు చూపుదురుగాని"

"నువ్వు చూళ్ళేవా యేమిటి? నా మానాన నన్ను వొదిలెయ్యి, సాయంత్రం అటువస్తాలే, మాటాడుకుందాం" అన్నాను.

"సాయంత్రం తప్పకండా వస్తారా?"

"ఏంచేస్తే నీకు నమ్మకం? ఇంత నమ్మిక లేకపోతే ఎట్లా? ఎవరిమీద ఒట్టు—"

"ఛాందసంగా మాట్లాడకండి. సాయంత్రం అయిదున్నరకి రండి-మర్చిపోకండావుంటే తప్పకండా వస్తారు, నాకు మాత్రం తెలీదు కనకనా" అంది.

కమల యీమాత్రం ఎస్సూరెన్స్ ఇస్తేచాలు, నేను సంతోషించగలను. ఎగ్జిబిషన్ కారణంగా ఊసుపోక సాయంత్రం కమల యింటికి వెళ్ళాలి నేను.

కమల...?

కాలం నామీద యెందుకింత పగపూనిందో

అర్థంకాదు. క్షణం తీరికలేని ఉద్యోగం, ఆవు లిస్తేపేగుల్లెక్కెట్టే స్నేహితులూ, ఏపని చేయబోయినా అంతరాయంచెప్పే అంతరాత్మ... యేమిటి జీవితం?... తృణప్రాయంగా చూదాం అనుకుంటాను ప్రతీదాన్నీ. ఆచరణలో యేదీ సాధ్యం కాదు. ఎవరికోసమో బతుకుతున్న నేను యెందుకో తేలీని పన్లు భుజానవేసుకుని ఊళ్లోని రోడ్లన్నీ నావే ననుకుని కాళ్ళరిగేటట్టు ఒళ్ళు కరిగేట్టు...మరేమిటో యేమిటో ఊహించటానికి అలవికాదు. అతీతమా? అర్థంకాదు.

ఏక్షణం యెట్లాంటిదో తెలీదు. ఎవరెవరు వచ్చి పలకరిస్తారో తెలీదు, ఎవరి ఆహ్వానం పాటించి ఎన్ని శ్రమదమాల పాలవాలో ఊహించలేము. యేమిటో అనిపిస్తుంది.

పేచీల్లేని వ్యవహారాలకోసం కలవరింతలు. బాధ్యతలేని సంసారాలకోసం తాపత్రయం జీవితంతో సంఘర్షణ కావాలి. సత్యాలు తేలాలి. ఏదో రిసెర్చి చేయటానికి మనసు వూరికే ఖేదపడటం. ఈ సమస్యలన్నీ యెప్పుడు పరిష్కారం అవుతాయో తెలీదు. అసలు అవుతాయా?

జవాబులేని ప్రశ్నలు. పదార్థాలులేని చింతన.

కమల యెవరు?

జీవితాల్లో ఒకళ్ళకీ మరొకళ్ళకీ ఏమిటీ అనుబంధాలు? తెంచేసుకున్నా పోని నిబంధనలు యెందుకు? సృష్టికి రహస్యం అంటూ వుందా అసలు?

నా జీవితంలో కమల యెవరు?

ఏమీయెరగనివాడిని, పరచింత యెన్నడూ తలపెట్టనివాడిని నా ఆలోచనలే నా సర్వస్వం అనుకునేవాడిని - నాకీ కమల జీవితంలో ఒక సమస్య ఎందుకవాలి?

అన్నీ కష్టాలు. ఒకదాని వెనక ఒకటి-పరంపరలా అనుసరిస్తో, సుఖమో కష్టమో నిష్ఠూరమో న్యాయమో ఒకటే సాకు మనకి.

డబ్బు సంపాదిస్తో కూడా ప్రతిపైసకీ బెదురు. రానున్న సంక్షోభానికి క్లేశం. ఊహించే విప్లవానికి దోహదం.

కమలని నే వొక్కసారి యెరగనట్టే అనుకున్నాను. కాని...కాని జరిగిందేమిటి- చివరకు మిగిలిందేమిటి?

సాయంత్రం వెళ్ళాలా? ఇట్లా ఎన్నిసార్లు చెప్పలేదు...ఏమో, బుద్ధికి తోచదు యిట్లాచెయ్యాలని. కుంటిజవాబులు చెబుతాను, గుర్తులేదనీ, యెవరో మరో పనిమీద పిల్చారనీ- కాని మనసులో అదే వేదన ఉంటుంది, కమల రమ్మంటే వెళ్ళలేదే అని! గాంభీర్యం తొణకను. కన్ను మూసినా అదే ఆలోచన.

నా మనస్సుని యిన్ని సమస్యల్లో యెందుకు ముంచెత్తాలి కమల? కమల చేసింది మటుకేమిటి? తెలిసి నేరంచేసిందా? తెలీకపోయినా నేరం నేరం కాక మానదు. "ఇగ్నొరెన్స్ యీజ్ నో ఎక్స్‌క్యూజ్" అంటారు గవర్నమెంటువాళ్ళు.

నైతిక విలువలకోసం పాటుబడే నేను యెందుకిట్లా దిగజారిపోతున్నాను? ఏ శక్తి నన్నిట్లా కిందిమెట్లకు తోస్తోంది?

"కమల తప్పు చేస్తోందా?"

తప్పేమిటి? ఈ యుగంలో యెవరేం చేసినా తప్పనేందుకు మరెవరికీ అధికారం లేదు. కాని అంటున్నవాళ్ళకు జవాబేమిటి? కమల అంటే నాకిష్టం కాదా? ఎందుక్కాదు? మల్లెపువ్వులు! తింటే చేదుగా ఉంటాయి.

సాయంత్రం వెడతాను! మేడ మెట్ల దగ్గర చంటివాడిని చంకనేసుకుని కమల నించుంటుంది; ఊరికే నించోటంకాదు-వేయి కళ్ళతో యెదురు చూస్తోంటుంది నాకోసం. హు, చంటివాడు. వాడికప్పుడే రెండో యేడు. అయినా యింకా నాకా చింతనవదిలిపోలేదు. కమలా! ఓ కమలా! హృదయాలు బద్దలుచేసుకుని భావాలు చదవనేర్చిన కమలా! నా ఉద్దేశం నీ కెందుకు అర్థంకాదు? ఎందుక్కాదు?

ఊహు. నువ్వందిచ్చే కాఫీ గ్లాసుతోనూ కాప్‌స్టన్ సిగరెట్లతోనూ నాకు మనశ్శాంతి కలగదు. ఈ సత్యాలను నేను అన్వేషించాలి.

ఒక సంఘటన జరుగుతుంది. దానికి తుదీ మొదలూ ఉండవా? చారిత్రక విలువ వుండదా? కాలగర్భం కనికరించదా? జరిగిన ఉదంతాలు యింత తేలిగ్గా మీరెట్లా మర్చిపోతున్నారు? జవాబులు చెప్పండి, నా మనస్సింత వికలం అవుతుందేం?